సాక్షి
వికారాబాద్

మంగళవారం । 24 । జూన్ । 2025



కేజీబీవీల్లో కొత్త రుచులు

కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కొత్త మెనూ తీసుకువచ్చింది. 8లో▸



రైతులకు మేలు చేసేందుకే..

పేదలు, రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. 8లో▸



అల్లుకున్న ప్రమాదం

వర్షాకాలం ప్రారంభం కావడంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంతోషి



సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు

పరిగి: మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంతోషి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని మహిళా నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి పథకంలో వారికి పెద్ద పీట వేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షురాలు సురేఖ, పట్టణ అధ్యక్షురాలు రజితరెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా కమిటీ ఏకగ్రీవం

అధ్యక్షుడిగా రాజేష్



రాజేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

పరిగి: స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడిగా రాజేష్‌ను జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిగి పట్టణంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్(మర్పల్లి), ఉపాధ్యక్షులుగా ముకుంద(కొడంగల్), నరేందర్, రాజు, అధికార ప్రతినిధిగా బిచ్చన్న, కోశాధికారిగా రాజేందర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వేరోలు జ్ఞాన సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని సూచించారు. అంబేడ్కర్, జ్యోతిరావుపూలే వంటి మహనీయులు చూపిన మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు. యువతకు, విద్యార్థులకు వారి ఆశయాల సాధన దిశగా స్వేరోస్ ముందుకు వెళ్తుందన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

చేనేత శాఖ డీఎంఓ కళింగరెడ్డి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

దౌల్తాబాద్: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ డీఎంఓ కళింగరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బాలంపేట గ్రామంలో మండలంలోని చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. ఇటీవల కార్మికులు వారి సమస్యలను కడా ప్రత్యేక అధికారి దృష్టికి తేవడంతో తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. కార్మిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. సంఘాలను పునరుద్ధరించి కొత్త సొసైటీలను ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యుల ఆర్థిక ఎదుగుదలకు సహకరించాలని విన్నవించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ అధికారిణి ఇంద్ర, తహసీల్దారు గాయత్రి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, నాయకులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అదనపు డ్యూటీలు రద్దు చేయాలి

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లతో బీఎల్ఓ అదనపు డ్యూటీలు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భారతి, మనోహర, విజయలక్ష్మి, నిర్మల, సంతోష, బుజ్జమ్మ, అండాలు, స్వరూపరాణి, కవిత పాల్గొన్నారు.

సగం ఇంట్లో.. మట్టిలో..

సీజన్ ప్రారంభమై నెల దాటినా 60శాతమే విత్తు

- ఊరిస్తున్న మేఘాలు
- చిరుజల్లులతో సరిపెడుతున్న వరుణుడు
- ఆకాశం వైపు చూస్తున్న అన్నదాత
- పెసర, మినుము, జొన్న సాగు చేయొద్దంటున్న అధికారులు



వికారాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా రైతన్న ఇంకా ఆకాశం కేసి చూడాల్సి వస్తోంది. వరుణుడి కోసం 15 రోజులుగా ఎదురు చూపులు తప్పడంలేదు. వర్షాకాలం ప్రారంభమైంది మొదలు ఒక్కసారి కూడా పెద్ద వాన పడకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. మొదట్లో అడపా దడపా వర్షాలు కురవగా సగం మంది రైతులు విత్తనాలు వేశారు. ఆ వెంటనే వర్షాలు మొహం చాటేశాయి. వారం రోజులుగా మేఘాలు ఊరిస్తున్నా చిరుజల్లులకే పరిమితం అవుతున్నాయి. పూర్తిస్థాయిలో విత్తుకు సరిపడా పదును కావడం లేదు. ఇప్పటికే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఇళ్లకు తెచ్చుకున్నారు. జిల్లాలో 5.61లక్షల ఎకరాల్లో ఆయా రకాల పంటలు వేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. 60 మిల్లీ మీటర్ల మేర రెండు మూడు సార్లు వర్షాలు కురిస్తేనే విత్తుకు అనుకూలమని అధికారులు అంటున్నారు. అయితే రెండు మూడు మండలాలు మినహా తగినంత వర్షపాతం నమోదు కాలేదు. అదును అయ్యే వరకు విత్తనాలు వేయకపోడమే మేలని అధికారులు సూచిస్తున్నారు. తెచ్చుకున్న విత్తనాలు సగం ఇంట్లో.. సగం మట్టిలో అన్నట్లు పరిస్థితి తయారైంది.

2.90 లక్షల ఎకరాల్లో విత్తనాలు

ఒక వేళ ముందుగా వర్షాలు పడితే రోహిణి కార్తెలో లేదంటే మృగశిర కార్తెలో విత్తనాలు వేస్తారు. ఈ ఏడాది మే 24న రోహిణి కార్తె ప్రారంభమైంది. నెల రోజులు కావస్తున్నా ఇంకా 60శాతం విత్తనాలే వేశారు. 40శాతం విత్తనాలు ఇళ్లలోనే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితిలో పెసర, మినుము, జొన్న పంటలు వేయకపోవడమే మంచిదని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. జిల్లాలో మొత్తం 5.61లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తు వేశారు. ఓ పక్క మేఘాలు ఊరిస్తున్నా సాగుకు సరిపడా మాత్రం కురవడంలేదు. ధైర్యం చేసి కొంత మంది రైతులు విత్తనాలు వేయగా అవి మొలకెత్తుతాయా లేదా అనే ఆందోళనలో రైతన్న ఉన్నాడు. కొన్ని చోట్ల మొలకెత్తాక కూడా ఎండిపోయాయి. మరికొన్ని చోట్ల మొలకెత్తలేదు.

16 పంటల సాగు

జిల్లాలో మొత్తం 16 రకాల పంటలు సాగు చేస్తారు. వీటిలో సింహభాగం పత్తి, కంది, మొక్కజొన్న, వరి పంటలు. గతేడాది క్వింటాలు పత్తి రూ.8 వేలకు పైగా అమ్ముడుపోవడంతో ఈ సారి పత్తి సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2.5లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది అంతకు మించవచ్చని అధికారులు అంచనా వేశారు. వరి, కంది సాగు సైతం పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూరగాయలు, వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉంది.

ఆ పంటలు వద్దు



ప్రస్తుత సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాం. సరిపడా వర్షాలు లేక సగం మేర విత్తనాలు వేయలేదు. మరో వారం రోజుల పాటు వర్షాలు పడకపోతే పెసర, మినుము, జొన్న సాగు చేయకపోవడం మంచిది. మిగతా పంటలు జూలై వరకు సాగు చేసుకోవచ్చు.

– మోహన్‌రెడ్డి, డీఏఓ

అన్నదాత ఆందోళన



వర్షాలు లేక ఎండిపోతున్న పత్తి మొక్కలు

దౌల్తాబాద్: పచ్చటి పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు వరుణుడి కరుణ లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమవుతున్నా వానజాడ కనిపించడం లేదు. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. పొలాలను దున్ని విత్తు వేశారు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని విత్తనాలు మొలకెత్తినా వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. వేల రూపాయలు వెచ్చించి పత్తి, జొన్న, కంది, పెసర తదితర రకాల విత్తనాలు వేస్తే భూమిపాలయ్యాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు దాదాపు రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు చేశామని రైతులు తెలిపారు. మండల వ్యాప్తంగా దాదాపు 8 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనాలు ఉంటాయో ఎండుతాయా అనే ఆందోళనలో రైతన్న ఉన్నాడు.

వర్షాల కోసం ఎదురుచూపు



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా సాగుకు సరిపడా వర్షాలు పడలేదు. మొదట్లో కురిసిన వర్షాలకు విత్తనం వేశాం. ఇప్పుడు వర్షాల జాడలేదు. సాయంత్రం కాగానే కారుమబ్బులు కనిపిస్తున్నాయి. కానీ చినుకులు పడటం లేదు. పొలంలో వేసిన విత్తనాలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడంలేదు. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే ఆర్థికంగా నష్టపోతాం.

– గోవింద్‌రెడ్డి, రైతు, దౌల్తాబాద్

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

- రైతు వేదికల వద్ద ఏర్పాట్లు
- హైదరాబాద్‌కు 250 మంది అన్నదాతలు
- ఐదు బస్సుల ఏర్పాటు
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట పెట్టుబడి సాయం అందించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి రైతులతో సీఎం మాట్లాడతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు రైతు వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, రైతులు వచ్చేలా మండల అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటికి 2,62,669 మంది రైతులకు 7 ఎకరాల వరకు రూ.318.45 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్‌లో జరిగే ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి జిల్లా నుంచి 5 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వికారాబాద్ నుంచి 2 బస్సులు, తాండూరు, పరిగి, కొడంగల్ నుంచి ఒక్కో బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 250 మంది రైతులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

దళితులపై దాడులను అరికట్టండి



నిరసన తెలుపుతున్న ప్రజా, దళిత సంఘాల నాయకులు, బాధితులు

- ప్రజా, దళిత సంఘాల నేతల డిమాండ్
- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన

తాండూరు టౌన్: నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో దళితులపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. యాలాల మండలం రాస్నం గ్రామంలోని దళితుల శ్మశాన వాటిక స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి, సీసీ రోడ్డును తవ్వేశారన్నారు. ఈ విషయం గురించి అడిగేందుకు వెళ్లిన దళితులను కులం పేరుతో దూషించారన్నారు. హాజీపూర్‌కు చెందిన రవికుమార్ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తుండగా కొందరు వ్యక్తులు దాడి చేశారన్నారు. అలాగే తాండూరు మండలం చెన్‌గేష్‌పూర్ గ్రామానికి చెందిన ఎరుకలి కులస్తులైన బస్వరాజ్ దంపతులపై పలువురు దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇలా నియోజకవర్గ పరిధిలో అగ్ర కులస్తులు.. దళితులపై అకారణంగా దాడులు చేస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్, సీఐటీయూ, పలు ప్రజా, దళిత సంఘాల నాయకులు మల్కయ్య, కె.శ్రీనివాస్, బాధితులు ఆశప్ప, అంజిలప్ప, భాస్కర్, లక్ష్మప్ప, వీరప్ప, అంజిలయ్య, రవి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య హక్కులు కల్పించాలి

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

అనంతగిరి: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములపై పేద రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బొంరాస్‌పేట మండలం దుప్చర్ల గ్రామ రైతుల తరఫున కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో దాదాపు 200 ఏళ్ల నుంచి పెద్దవాగు సమీపంలో 40 ఎకరాల మిగులు భూమిని నిరుపేద దళితులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్‌పీ నాయకులు, రైతులు

గొలుసుకట్టు కాలువలను పునరుద్ధరిస్తాం

- ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి

తుర్కయంజాల్: గొలుసుకట్టు కాలువలను పునరుద్ధరించి ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీరు సులువుగా ప్రవహించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే చెరువులు అలుగు పారే అవకాశాలు ఉండడంతో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు, ఇంజాపూర్‌లోని దిలావర్ ఖాన్ చెరువు, ఈదుల చెరువుల కాలువలను ఏఈ వంశీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. కాలువలు పూడిక తీయకంపోవడంతో పలు చోట్ల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వరద వచ్చినా సులువుగా ప్రవహించి, కాలనీలు ముంపునకు గురవకుండా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



మాసబ్ చెరువు కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ, ఏఈ

దరఖాస్తు చేసుకోండి

డీఈఓ రేణుకాదేవి



అనంతగిరి: జిల్లాలోని 9 మండలాల్లో ఉన్న భవిత సెంటర్లలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు ఫిజియోథెరపీ చేసేందుకు అర్హులైన ఫిజియోథెపిస్టులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రేణుకాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు, బషీరాబాద్, మర్పల్లి, బొంరాస్‌పేట, ధారూరు, చౌడాపూర్, కోట్‌పల్లి, బంట్వారం, కుల్కచర్ల మండలాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన బీపీటీతో పాటు పామా మెడికల్ అసోసియేషన్‌లో రిజిస్ట్రేషన్ కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. పై అర్హతలు ఉన్న జిల్లాకు చెందిన స్థానిక అభ్యర్థులు తమ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి

- బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి నష్టం జరగనీయం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్: సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. కమ్మదనం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తూ గత పాలకులు స్వార్థరాజకీయాలకు పాల్పడి, ప్రజా జీవితాలకు భంగం కలిగే విధంగా వ్యవహరించారని విమర్శించారు. భార్యాభర్తలు మాట్లాడుకున్న మాటలు కూడా వినడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన సూత్రధారులు, పాత్రదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడారని, తెలంగాణకు ఏవిధంగా నష్టం జరుగుతుందో స్పష్టంగా వివరించారని తెలిపారు. ఈ విషయంలో కేంద్రానికి స్పష్టత ఉందన్నారు. ఏ ప్రాజెక్టు విషయంలోనైనా తెలంగాణకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



కమ్మదనం గ్రామంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎంపీ డీకే అరుణ

అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్ రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మోహన్‌సింగ్, విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ అమలుకు చర్యలు

- అధికారులు సమయపాలన పాటించాలి
- ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లా కేంద్రంతోపాటు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ విధానం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు సమస్యల పరిష్కారం కోసం 146 దరఖాస్తులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు విధిగా సమయపాలన పాటించాలన్నారు. ఇందుకోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ యంత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను పూర్తి స్థాయిలో సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వన్ మెడీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొలెస్ట్రాల్, కిడ్నీ, లివర్, కాల్షియం, క్రియాటిన్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మనుషుల జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పుల వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. నేడు కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు, ఉద్యోగులకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలించే దిశగా ప్రాథమిక, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి , డీఎంహెచ్ఓ వెంకటరవణ, వన్ మెడీ హబ్ ఫౌండర్ సంతోష్, డాక్టర్ శ్రీకాంత్, ల్యాబ్ టెక్నీషియన్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో ఈ నెల 20నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేసి వికారాబాద్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. డ్రగ్స్ మూలాలను గుర్తించి, వాటి రవాణా, విక్రయాలు, వినియోగం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు పెడదోవ పట్టకుండా కాపాడాలన్నారు. విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేసి అవి క్రియాశీలకంగా పని చేసేలా చూడాలన్నారు. ఈ నెల 25న పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఎంహెచ్ఓ వెంకటరవణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డీఎస్పీ జానయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాజేశ్‌రెడ్డి తదితరులు

బొంరాస్‌పేట: పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారమవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బాపన్‌చెరువుతండా పంచాయతీ పరిధిలోని బీక్యానాయక్ తండాలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, అంజిల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, గుండప్ప, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గోపాల్, చిన్న నర్సింలు, సాయిలు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్



విద్యార్థులతో కలిసి మొక్క నాటిన ఎస్‌ఐ

బొంరాస్‌పేట: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొట్లోనిగూడ తండా గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రకృతి కాపాడాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిట్ విచారణకు హాజరు



విచారణకు హాజరైన హెచ్‌ఎం నర్సిరెడ్డి

తాండూరు: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పలువురు స్థానిక వ్యక్తులు సిట్ విచారణకు హాజరవుతున్నారు. సోమవారం నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విచారణకు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు నర్సిరెడ్డి హాజరయ్యారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ నేత డాక్టర్ సంపత్‌కుమార్ స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేసిన విషయం తెలిసిందే. 2023 నవంబర్ 15నుంచి 30 వరకు ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు చెప్పారన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న నర్సిరెడ్డి ఫోన్‌ను ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందనే అంశంపై సిట్ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం.

రీల్స్ కోసం బైక్‌పై ప్రమాదకర స్టంట్

రాజేంద్రనగర్: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఎనిమిది మంది యువకులు ఓ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంపై అర్ధరాత్రి రీల్స్ కోసం స్టంట్ చేశారు. జాతీయ రహదారిపై ఈ స్టంట్ కొనసాగుతుండటంతో ఈ మార్గంలో వెళ్తున్న వారు తమ సెల్‌ఫోన్‌లో బంధించి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారిలో ఇలాంటి స్టంట్ అర్ధరాత్రి వేళ జరుగుతుండటంతో పలువురు తమ ఎక్స్ వేదికల ద్వారా దీనిని సైబరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితులను పట్టుకొని ఆర్‌జీఐ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన ప్రకారం... ఈ నెల 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది యువకులు బైక్‌పై శంషాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు పయనమయ్యారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు మైనర్లతో పాటు ఐదుగురు యువకులు పయనిస్తూ రీల్స్ చేశారు. ప్రమాదభరితంగా ఈ జాతీయ రహదారిపై స్టంట్ నిర్వహించారు. ఈ దృశ్యాలను అటుగా వెళుతున్న పలువురు చిత్రీకరించి ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఈ రహదారి రాత్రి సమయాల్లో బిజీగా ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో వీఐపీల రాకపోకలతో అలర్ట్‌గా ఉంటుంది. ఈ స్టంట్ విషయమై పలువురు సైబరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులను సోమవారం గుర్తించారు. బైక్‌తో పాటు ఐదుగురు యువకులను, ముగ్గురు మైనర్లను రాజేంద్రనగర్ పోలీసులకు సోమవారం సాయంత్రం అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీల్లో కొత్త రుచులు

కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కొత్త మెనూ తీసుకువచ్చింది. నెలలో రెండుసార్లు మటన్, ఐదుసార్లు గుడ్లు, ప్రతీ రోజు నెయ్యి ఉండేలా మెనూ ప్రకటించారు.

- బాలికల పౌష్టికాహారం కోసం నూతన మెనూ
- నెలలో రెండు సార్లు మటన్, ఐదుసార్లు గుడ్లు
- మెస్‌చార్జీలు పెంచిన ప్రభుత్వం



దౌల్తాబాద్ కస్తూర్బాగాంధీ విద్యాలయం

దౌల్తాబాద్: నాణ్యమైన విద్య, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం దేశవ్యాప్తంగా కేజీబీవీలు నిర్వహిస్తోంది. వీటి నిర్వహణ బాధ్యతలు రాష్ట్రప్రభుత్వం ఆధీనంలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల బలోపేతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. బాలిక ఆరోగ్యంపై సర్వే చేపట్టగా పౌష్టికాహారలోపంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కుంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం బాలికలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కేజీబీవీల్లో మెస్ చార్జీలు పెంచి ఆహార మెనూలో మార్పులు చేసింది. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం ఆహారం అందజేస్తున్నారు.

మెనూ ఇలా..

ఉదయం: టమాట కిచిడీ, సాంబార్, రాగిజావ, బూస్టు, పూరి, ఉప్మా, పులిహోరా, బోండా, వడ, చపాతీ, జీరారైస్, అరటిపండు

మధ్యాహ్నం: టమాట పప్పుతో అన్నం, నేయి, రసం, పెరుగు, ఉడకించిన గుడ్డు, చికెన్

సాయంత్రం: ఉడికించిన శనగలు, బజ్జీలు, అల్లం టీ, మిల్లెట్ బిస్కెట్, పకోడి

రాత్రి: అన్నం వివిధ రకాల కాయగూరలు, సాంబారు, మజ్జిగ వీటితో పాటు నెలలో రెండుసార్లు మటన్, ఐదుసార్లుల గుడ్లు, ప్రతీరోజు నెయ్యి ఇవ్వాల్సి ఉంటుంది.

కొత్త మెనూ ప్రకారమే..

విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచే మెనూను కేజీబీవీల్లో అమలు చేస్తున్నాం. ఇప్పటికే కొత్త మెనూ పక్కాగా అమలు చేయాలని ఎస్‌ఓలకు ఆదేశాలు జారీ చేశాం. కొత్త మెనూను ప్రదర్శనకు ఉంచాలని సూచించాం.

– శ్రీదేవి, జీసీడీఓ, వికారాబాద్

పొలాల వద్ద ఇసుక డంపులు

సీజ్ చేసిన అధికారులు



ఉదన్‌రావుపల్లిలో ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

దోమ: ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అనుబంధ గ్రామమైన ఉదన్‌రావుపల్లికి చెందిన తొమ్మిది మంది రైతులు అక్రమంగా పాలేపల్లి–ఉదన్‌రావుపల్లి వాగు నుంచి ట్రాక్టర్ల సాయంతో ఇసుక తీసుకువచ్చి పొలాల వద్ద డంపులుగా నిల్వ చేసుకున్నారనే సమాచారం అందిందన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టి వాటిని సీజ్ చేశామన్నారు. మంగళవారం తహసీల్దార్ గోవిందమ్మ ఎదుట బైండోవర్ చేసి జరిమానా విధిస్తామన్నారు. ఇసుక అవసరమున్న వారు తహసీల్దార్ వద్ద అనుమతులు తీసుకొని ట్రాక్టర్‌ల సహాయంతో తరలించుకోవాలని సూచించారు. ఈ దాడుల్లో ఆర్‌ఐ సుదర్శన్, హెడ్ కానిస్టేబుల్ నర్సింలు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి



మాట్లాడుతున్న రుద్రమూర్తి

డివిజన్ పరిధిలోని రైతుల వివరాలు	
మండలం	రైతులు
తాండూరు	14,804
పెద్దేముల్	15,161
యాలాల	14,798
బషీరాబాద్	14,512

తాండూరు రూరల్: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలని తాండూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. సోమవారం ఆయన వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుద్రమూర్తి మాట్లాడుతూ.. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింకు ఉన్న మొబైల్‌తో సంబంధిత ఏఈఓల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటేనే భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సబ్సిడీ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. అపోహలకు తావులేకుండా రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు.

రైతులకు మేలు చేసేందుకు చర్యలు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: పేదలకు, రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రైతులకు ఉచితంగా కంది విత్తనాల మినీకిట్స్ (చిరు సంచులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కంది సాగును ప్రోత్సహించేదుకు ఉచితంగా కంది విత్తనాలు సరఫరా చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బుచ్చయ్య, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ పరిధిలోనూ భరోసా ఇవ్వాలి



ఎల్మినేడులో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్మినేడులో ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న మండలాలకు రైతు భరోసా విడుదల చేయాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు బీఆర్ఎస్ ఎల్మినేడు గ్రామ అధ్యక్షుడు దొమకొండ నర్సింహ అధ్యక్షతన మహాధర్నా చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కృపేష్, బుగ్గరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెండు దఫాలుగా రైతు భరోసా ఇవ్వకపోవడం సిగ్గు చేటు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం మండలాల రైతులు ఓట్లు వేయలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో వివక్ష చూపకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. రైతులపై వివక్ష చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా విడుదల చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బుట్టి మహేశ్, నిట్టు జగదీశ్వర్, బాష, యాదయ్య, రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి మహిళ మృతి




మహిళ మృతికి కారణమైన నీటి గుంత

మొయినాబాద్: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ మహిళ దుస్తులు ఉతకడానికి వెళ్లి నీటి గుంతలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మొయినాబాద్‌లో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం రిబ్బన్‌పల్లికి చెందిన మంజుల(31) కుటుంబం కొన్నేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. కొంత కాలం క్రితం ఆమె భర్త రవికుమార్ మృతి చెందాడు. ముగ్గురు పిల్లలతో కలిసి సురంగల్ రోడ్డు పక్కన ఓ గుడిసె వెసుకుని నివాసముంటూ కూలీ పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఇదిలా ఉండగా ఆదివారం మొయినాబాద్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ఓ నీటి గుంతలో దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయింది. సోమవారం అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గుంతలో తేలిన శవాన్ని గమనించి, మున్సిపల్ వార్డు అధికారి సుదర్శన్‌కు సమాచారం అందించాడు. సుదర్శన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి మరణించడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

మోదీ పాలనలో దేశం పురోగతి

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం



చేవెళ్లలో మొక్క నాటుతున్న కేఎస్ రత్నం తదితరులు

చేవెళ్ల: దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. స్థానిక కేవీఆర్ గ్రౌండ్‌లో సోమవారం చేవెళ్ల మున్సిపాలిటీ బూత్‌స్థాయిలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. మోదీ సారథ్యంలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. తల్లికి వందనంతో దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతీ బూత్‌లో కనీసం 50 మొక్కలు నాటాలని, నియోజకవర్గంలో 25వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వానం పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు విఠల్‌రెడ్డి, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, కుంచం శ్రీనివాస్, నాయకులు మధుసుధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేస్తున్న నాయకులు

దుండగులపై చర్యలు తీసుకోవాలి

- అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం సిగ్గుచేటు
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య

పరిగి: కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ధ్వంసం చేయడం అంటే దేశ ద్రోహుల కిందే లెక్కగట్టాలన్నారు. పేదలు, దేశాభ్యున్నతికి పాటుపడిన మహనీయుడికి అవమానం జరగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, వెంకటయ్య, ప్రశాంత్, రాము, ప్రభు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల ఆందోళన

కుల్కచర్ల: మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నేతలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల నాయకులు పుట్టపహాడ్ నుంచి కుల్కచర్ల వరకు నిరసన పాదయాత్ర చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. మహనీయుడి విగ్రహంపై దాడి హేయనీయం అన్నారు. వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ ఎంపీపీ సత్యమ్మ, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, ఏఐసీసీ నాయకులు రాములు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

అనంతగిరి: కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విగ్రహ ధ్వంసం చేసిన సంఘం విద్రోహ శక్తులను ప్రోత్సహించే వ్యక్తులను, వ్యవస్థను రూపుమాపాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రాములు, మొగులయ్య, శ్రీనివాస్, వినోద్‌కుమార్, భరత్‌కుమార్, శ్రీనివాస్, వెంకట్, బుగ్గన, బుచ్చన్న, నరేందర్, రాములు, వెంకట్‌రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.



పరిగి: నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సెలూన్ల బంద్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటుకు నిరసనగా నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సెలూన్ల బంద్‌కు పిలుపునిచ్చారు. రెండు రోజులుగా దుకాణాలను మూసి ఉంచారు. ఈ సందర్భంగా వారు స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లకు వినతిపత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం

సమస్య పరిష్కరిస్తానని ఏఈ హామీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లిలో పైప్‌లైన్ లీకేజీతో కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై మిషన్ భగీరథ ఏఈ ప్రణీత్‌ను వివరణ కోరగా.. రెండు రోజు ల్లో మరమ్మతులు చేపడతామని గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గ్రామ పంచాయతీగా వాల్యానాయక్ తండా



ఎంపీడీవో, ఎంపీఓలను సన్మానిస్తున్న వాల్యా నాయక్ తండా వాసులు

దుద్యాల్: సోమ్లానాయక్ తండా స్థానంలో వాల్యానాయక్ తండాను గ్రామ పంచాయతీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమ్లానాయక్ తండాలో జనాభా తక్కువగా ఉండడంతో వాల్యానాయక్ తండాకు అనుబంధంగా సోమ్లానాయక్ తండా, రక్తమైసమ్మ తండా, కస్న నాయక్ తండా, జీడిగడ్డ తండాలను అనుబంధ గ్రామాలుగా కలిపారు. ఈ మేరకు వాల్యానాయక్ తండా వాసులు ఎంపీడీఓ మహేశ్‌కుమార్, ఎంపీఓ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. అనతరం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు రవీందర్ నాయక్, హన్మంత్ నాయక్, వెంకట్ నాయక్, శ్రీనివాస్ నాయక్, అంబర్ సింగ్, శంకర్ నాయక్, మోహన్ నాయక్ పాలొన్నారు.


మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

యాచారం: బస్సు కోసం వేచి చూస్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు పుస్తెల తాడును అపహరించారు. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన బండ పార్వతమ్మ(58) సోమవారం మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లేందుకు నక్కర్తమేడిపల్లిలోని బంధువుల ఇంటి నుంచి తక్కళ్లపల్లి గేట్ వద్దకు వచ్చింది. ఇది గమనించిన ఇద్దరు దుండగులు హెల్మెట్ ధరించి, బైక్‌పై వచ్చారు. పార్వతమ్మ మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కెళ్లారు. ఈ సమయంలో ఆమె కిందపడిపోయినా దుండగులు తాడు వదల్లేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రూ.7 కోట్ల విలువైన భూమికి ఎసరు!

చిల్కమర్రి రెవెన్యూ సదస్సులో వెలుగులోకి..

- అధికారులను ఆశ్రయించిన బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్



షాద్‌నగర్ రూరల్: ధరణి లొసుగులు.. మీసేవ నిర్వాహకుల సహకారంతో తండ్రీకొడుకులు రూ.7 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమికి ఎసరుపెట్టారు. ప్రభుత్వం ఇటీవల చిల్కమర్రిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో తహసీల్దార్ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మీసేవ నిర్వాహకులతో కుమ్మక్కై..

గ్రామానికి చెందిన కొత్తపల్లి వినోద, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు. కొంత కాలం క్రితం శ్రీనివాస్‌రెడ్డి చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న 2.8 ఎకరాల భూమి 2022లో వినోద పేరిట విరాసత్ జరిగింది. ఈ భూమిపై కన్నేసిన వినోద మామ సుభాన్‌రెడ్డి, బావ మధుసూదన్ రెడ్డి పట్టణంలోని ఓ మీసేవ నిర్వాహకులతో కుమ్మక్కయ్యారు. వినోదకు తెలియకుండా ఆమె ఫోన్‌కు వచ్చిన ఓటీపీని సంపాదించి దొంగ జీపీఏ డాక్యుమెంట్ సృష్టించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ వివరాలు తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులను ఆశ్రయింగా జీపీఏ ద్వారా ఇతరులకు మారిందని చెప్పారు. సదస్సులు ముగిసిన తర్వాత వినోద తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది.

ఇదే గ్రామంలో మరొకరి భూమిని

ఇదే గ్రామానికి చెందిన కొత్తపల్లినర్సింహారెడ్డి, నవనీత దంపతులకు మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. నర్సింహారెడ్డి పేరిట 1.29 ఎకరాల భూమిని కాజేసేందుకు సుభాన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఆమె భార్య నవనీతను రంగంలోకి దింపారు. భర్త ఫోన్ నవనీత దగ్గరే ఉండడంతో ఓటీపీ తీసుకుని జీపీఏ డాక్యుమెంట్ సృష్టించారు. సదరు భూమిని దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి సేల్‌డీడ్ చేశారు. తహసీల్దార్ విచారణలో ఈ తతంగమంతా బయటపడింది. ఇద్దరు పట్టాదారులకు సంబంధించి రూ.7కోట్ల విలువైన దాదాపు నాలుగు ఎకరాల భూమిని కాజేసినట్లు తేలింది.

పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు

పట్టాదారులకు తెలియకుండా భూములు చేతులు మారడంతో తహసీల్దారు పార్థసారధి సదరు భూముల రిజిస్ట్రేషన్‌పై విచారించారు. స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ తయారీ ఎక్కడ జరిగిందనే విషయాలను పరిశీలించారు. మీసేవ సెంటర్‌లో ఓటీపీలతో డాక్యుమెంట్ తయారు చేసినట్లు గుర్తించారు. సదరు మీసేవ నిర్వాహకులతో పాటుగా దొంగ జీపీఏ, రిజిస్ట్రేషన్ చేసిన వారిపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.